ముస్తాబైన రామాలయాలు

- నేడు శ్రీరామనవమి
- కామోల్‌లో 300 ఏళ్లుగా ఉత్సవాలు



కామోల్‌లోని శ్రీసీతారాముల ఆలయం

భైంసారూరల్: మండలంలోని కామోల్ గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాలు సుమారు 300 ఏళ్లకుపైనే కొనసాగుతూ వస్తున్నాయి. శ్రీరామనవమి నేపథ్యంలో ఇప్పటికే సీతారాముల ఆలయాన్ని ముస్తాబు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా టెంట్లు, తాగునీరు వంటి వసతులు ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం కుస్తీ పోటీలు నిర్వహించనున్నారు.

ఆలయ చరిత్ర ఇది..

గతంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు సంభాజి మహారాజ్.. దయారాం రాజారాం దేశ్‌పాండేను తమ రాజ్యంలోని కామోల్ గ్రామం జాగీర్దారుగా ప్రకటించారు. మహారాష్ట్రలోని నాసిక్ ప్రాంతంలో ఉండే దేశ్‌పాండే అక్కడి రామ మందిరంలో ప్రత్యేక పూజలు చేసేవారు. ఇక్కడకు వచ్చాక తమ కులదైవమైన శ్రీరామచంద్రుడ్ని కొలిచేందుకు కామోల్‌లో పూజా మందిరం నిర్మించారు. మహారాష్ట్రలోని నాసిక్, పైఠాన్, మదల్‌గావ్, ఔరంగాబాద్, దారూర్ ప్రాంతాల్లో పంచాంగాలు తయారు చేసే బ్రాహ్మణులు, వేదపండితులను తీసుకొచ్చి ఉగాది పర్వదినం నుంచి తొమ్మిది రోజుల పాటు ఇక్కడి పూజ మందిరంలో రామనవమి ఉత్సవాలు జరిపించేవారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో శాలిగ్రామ్ శిలతో చెక్కిన రామ లక్ష్మణుల విగ్రహాలను తీసుకొచ్చి ఇక్కడ ప్రతిష్ఠించారు. చుట్టుపక్కల ఆలయాల్లో పాలరాతి దేవతామూర్తులను ప్రతిష్ఠిస్తే ఇక్కడ మాత్రం నల్లని శాలిగ్రామ్ శిలతో చెక్కిన దేవతామూర్తులు దర్శనమిస్తాయి. తొమ్మిది రోజుల అనంతరం శ్రీరామనవమి రోజు కల్యాణం నిర్వహిస్తారు.

కొనసాగుతున్న సంప్రదాయం..

వందల ఏళ్ల నాటి ఆచారాన్ని దయారాం రాజారాం దేశ్‌పాండే వంశీయులు కొనసాగిస్తూ వచ్చారు. 1978లో ఆయన మనుమడు నారాయణరావు దేశ్‌పాండే ఆలయ నిర్వహణతోపాటు ఉత్సవాల బాధ్యత గ్రామస్తులకు అప్పగించారు. అప్పటినుంచి ఆలయ కమిటీ ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

సారంగాపూర్: మండలంలోని జామ్, స్వర్ణ గ్రామాల్లోని రామాలయాల్లో వీడీసీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. జామ్ పట్టాభి రామాలయం నిర్మాణంలో ఉండగా పక్కనే ఏర్పాటు చేసిన మండపంలో గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు శ్రీసీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం శుక్రవారం మధ్యాహ్నం నుంచి అన్నదానం చేస్తారని వీడీసీ సభ్యులు తెలిపారు.

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి రామాలయం సీతారాముల కల్యాణ వేడుకలకు సిద్ధమైంది. మూడు రోజులుగా సిద్ధం చేస్తున్న లక్ష తలంబ్రాలు చేతితోనే ఒలుస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు కల్యాణం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సీతారాముల ప్రతిమల పంపిణీ



ప్రతిమలను పంపిణీ చేస్తున్న గ్రామస్తులు

కుంటాల: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో బుధవారం 210 కుటుంబాలకు శ్రీ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి ప్రతిమలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. కల్లూరు సాయిబాబా ఆలయంలో, కుంటాల ప్రాచీన శ్రీకృష్ణ దేవాలయం, శ్రీ రామకృష్ణ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఏర్పాట్లను పూర్తి చేశారు.

క్లుప్తంగా

ముగిసిన శిక్షణ తరగతులు

తానూరు: మండలంలోని కోలూరు రైతువేదికలో మూడు రోజులుగా స్వచ్ఛభారత్ మిషన్‌పై కొనసాగుతున్న ఎస్‌బీఎం శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. చివరిరోజు క్షేత్రస్థాయి ప్రదర్శనలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు పలు వివరాలు వెల్లడించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మోహన్‌సింగ్, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

వీధి కుక్కల పట్టివేత



కుక్కలను ఎక్కిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: వీధి కుక్కల బెడదను నివారించేందుకు బల్దియా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. పట్టణంలో నిత్యం ఏదో ఒక చోట కుక్కకాటు ఘటనలు జరుగుతున్నాయి. బుధవారం విశ్వనాథ్‌పేట్, గాజులపేట్ ప్రాంతాల్లోని దాదాపు 25 శునకాలను మున్సిపల్ సిబ్బంది పట్టుకుని వాహనాల్లో తరలించారు.

వార్డు సభలో అభ్యంతరాలు

భైంసాటౌన్: పట్టణ పరిధిలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం బుధవారం వార్డుసభలు నిర్వహించారు. 26 వార్డుల వారీగా సభలు నిర్వహించి 1,054 మంది లబ్ధిదారుల పేర్లతో కూడిన జాబితాలు ప్రదర్శించారు. వార్డు సభలను అదనపు కలెక్టర్ రాంబాబు పరిశీలించారు. అనంతరం 15 అభ్యంతరాలు స్వీకరించినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే ప్రవేశం పొందాలి



కరపత్రాలు అందిస్తున్న డిగ్రీ అధ్యాపకులు

సారంగపూర్: అన్ని సౌకర్యాలు కల్గిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే విద్యార్థులు ప్రవేశం పొందాలని నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు రవీందర్ అన్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో పరీక్షలు రాసి బయటకు విచ్చన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో వసతులు, సౌకర్యాలు, విద్యావిధానం తెలియజేసే కరపత్రాలను బుధవారం పంపిణీ చేశారు. అధ్యాపకుడు మురళీధర్ తదితరులు ఉన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



పోషకాహార కిట్ అందిస్తున్న ఎంపీపీ పద్మ

లక్ష్మణచాంద: పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని ఎంపీపీ అడ్వాల పద్మ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో ఐసీడీఎస్, వరల్డ్ విజన్ సంస్థ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, డ్వాక్రా సంఘం మహిళలతో మాట్లాడారు. అంతకుముందు సీమంతాలు, అన్నప్రాసన, అక్షరాభ్యాసాలు చేశారు. అనంతరం వరల్డ్ విజన్ సమకూర్చిన పోషకాహార కిట్లను లబ్ధిదారులకు అందించారు. సూపర్‌వైజర్ భాగ్యవతి, ఏపీఎం వాణిశ్రీ, సంస్థ మేనేజర్ బ్రహ్మన్న పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం

భైంసాటౌన్: భైంసా బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. సంతోష్‌కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా అధ్యక్షుడిగా బోయిడి రఘువీర్, ప్రధాన కార్యదర్శిగా మునీర్ అహ్మద్, సంయుక్త కార్యదర్శిగా తాడేవార్ సాయినాథ్, కోశాధికారిగా కుంట కీర్తి కుమార్, లైబ్రరీ సెక్రెటరీగా ముత్తన్న, గేమ్స్ స్పోర్ట్స్ సెక్రెటరీగా చిన్నన్న, లేడీ రిప్రెసెంటేటివ్‌గా నవనీత ఎన్నికయ్యారు.

హైర్‌బస్ డ్రైవర్ల ధర్నా

భైంసాటౌన్: పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద బుధవారం వేకువజామున హైర్ బస్ డ్రైవర్లు ధర్నా చేపట్టారు. ఇతర డిపోల్లో హైర్‌బస్ డ్రైవర్లకు వేతనాలు పెంచినా.. భైంసాలో మాత్రం అమలు చేయడం లేదన్నారు. హైర్ బస్సు యజమానులు తమను వేధిస్తున్నారని.. వేతనాలు పెంచాలని ప్రశ్నిస్తే బెదిరిస్తున్నారని వాపోయారు. దీంతో అక్కడ బస్సు యజమానులతో వారికి వాగ్వాదం జరిగింది. డీఎం అమృత డిపో వద్దకు వెళ్లి హైర్‌బస్ యజమానులతో మాట్లాడటంతో వారు ధర్నా విరమించారు.

'సమస్యలు పరిష్కరించండి'

భైంసాటౌన్: ముధోల్ నియోజకవర్గంలో కొందరికి సాంకేతిక కారణాలతో రైతుబంధు రావడం లేదని.. సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్‌మిట్టల్‌ను కోరారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన వారిని బుధవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో కలిశారు. చెరువులు, కాల్వలు, రోడ్ల అభివృద్ధికి భూసేకరణ చేయగా సంబంధిత పట్టాలో మిగిలిన రైతులకు రై తుబంధు రావడం లేదన్నారు. సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

లోకేశ్వరం మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ లలిత

లోకేశ్వరం: మండల కేంద్రంలో బుధవారం ఎంపీపీ బి.లలిత అధ్యక్షతన లోకేశ్వరం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గత సమావేశానికి గైర్హాజరైన మూడు (అటవీ, విద్య, విద్యుత్) శాఖల అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే సదరు అధికారులకు నోటీసులు జారీ చేయడంతో సభ్యులు శాంతించి సమావేశం కొనసాగించారు. గ్రామాల్లోని చెరువుల్లో పూడికతీత పనులను ఉపాధిహామీ కూలీలకు అప్పగించేందుకు అనుమతుల కోసం సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈసారి సమావేశానికి 19శాఖల అధికారులకు గాను అటవీశాఖ అధికారి మాత్రమే గైర్హాజరయ్యారు.

- ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని 174 ఎకరాల్లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లగా నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించామని ఏవో గణేశ్ పేర్కొన్నారు.
- గ్రామాల్లో నిర్మించుకున్న వ్యక్తిగత మరుగుదొడ్ల బిల్లులు నాలుగేళ్లుగా రావడం లేదని గడ్‌చాంద సర్పంచ్ వెంకట్‌రావు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఉన్నతాధికారులకు నివేదించి డబ్బులు అందేలా చూస్తామని ఏపీవో జగన్నాథ్ తెలిపారు.
- కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకొని ఏళ్లు గడుస్తున్నా మంజూరవడం లేదని పోట్‌పల్లి సర్పంచ్ సురేఖబాయి పేర్కొనగా.. సైట్ ఓపెన్ కాక కొత్తవి మంజూరవడం లేదని ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ సరిత తెలిపారు.
- ఆర్‌అండ్‌బీ నిధులతో లోకేశ్వరం నుంచి గడ్‌చాంద వరకు తారు రోడ్డు నిర్మించామని.. లోకేశ్వరం నుంచి నందిపేట్ వరకు మట్టి రోడ్డు పనులు సాగుతున్నాయని ఆర్‌అండ్‌బీ ఏఈ రఘు తెలిపారు.
- కన్కపూర్ గ్రామానికి భగీరథ నీరు రావడం లేదని సర్పంచ్ నరేష్ పేర్కొనగా లీకేజీ పైపులకు మరమ్మతులు చేయించి నీటిని సరఫరా చేస్తామని మిషన్ భగీరథ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. తహసీల్దార్ సరిత, ఎంపీడీవో సల్మాన్‌రాజ్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, ఏఈలు శివకుమార్, రఘు, శ్రీకాంత్, రఘువంశీ, ఏవో గణేశ్, ఏపీవో మల్లేశ్, ఏపీఎం జగన్నాథ్, పశువైద్యాధికారి జెస్సీ ఉన్నారు.

నంబర్‌ప్లేట్ లేకుంటే వాహనాలు స్వాధీనం



మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్

భైంసారూరల్: వాహనాలకు నంబర్‌ప్లేట్ లేకుంటే స్వాధీనం చేసుకుంటామని భైంసారూరల్ సీఐ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని ఖత్‌గాం గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 81 బైక్‌లు, ఆటో, కారును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. వాహనదారులు అన్ని ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. అపరిచిత, అనుమానిత వ్యక్తులుంటే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. సర్పంచు రాజు, ఎస్సై శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలి




కుభీర్‌లో పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


సారంగపూర్: మండల కేంద్రంలో ఏప్రిల్ 4న నిర్వహించే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు మాధవరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సమ్మేళనంపై సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వర్ రెడ్డి, పార్టీ మండల ఇన్‌చార్జి మురళీధర్‌రెడ్డి నేతృత్వంలో సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఆయా గ్రామాల కార్యకర్తలు ఉన్నారు.

కుభీర్: మండలకేంద్రంలోని బాలాజీ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఈనెల 31న కార్యకర్తలతో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు అనిల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం నాయకులు సమ్మేళనం ఏర్పాట్లను పరిశీలించారు. మండలం పెద్దగా ఉండటంతో 20 పంచాయతీలకు 31న, మరో మరో 20 పంచాయతీలకు వచ్చే నెలలో మాలేగాంలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తామని వారు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్, మండల ఉపాధ్యక్షుడు మోహినొద్దీన్, శంకర్, గంగాచరణ్, రమేశ్, గంగాధర్ ఉన్నారు.

ఉల్లాసంగా వీడ్కోలు వేడుకలు



మస్కాపూర్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయులు



తానూరు: ఎల్వి పాఠశాలలో విద్యార్థుల నృత్యం

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో జెడ్పీఎస్ఎస్, కేజీబీవీలో పదోతరగతి విద్యార్థులకు జూనియర్లు వీడ్కోలు పలికారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎం బాలాజీ, ప్రత్యేకాధికారి సునీతారాణి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రమేశ్, రమాదేవి, శ్రీనివాస్, ఎస్‌ఎంసీ చైర్మన్ కృష్ణ తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద(సోన్): సోన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. సర్పంచ్ వినోద్, ప్రధానోపాధ్యాయుడు గజ్జారాం, ఎస్‌ఎంసీ చైర్మన్ రాజేశ్వర్, ఉపాధ్యాయులు రవికిరణ్, భీమేశ్వర్, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, పోతన్న పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు తొమ్మిది తరగతి విద్యార్థులు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు భూమన్నయాదవ్ మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించి తల్లిదండ్రులు, పాఠశాల పేరు నిలబెట్టలన్నారు. నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు మాధవ్‌రావ్, సుదర్శన్, రమేశ్, గంగారాణి, సుజాతాదేవి, నర్సయ్య, ధర్మాజీ చందనే, లక్ష్మీకాంత్ షిండే, సీఆర్పీ గంగాధర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పరీక్షప్యాడ్లు అందజేత

దస్తురాబాద్: మండలంలోని మున్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను జెడ్పీటీసీ శారద అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత, జెడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాలలతో పాటు మండలంలోని రాజురా, సుర్జాపూర్, బీర్నంది, సత్తనపల్లి జెడ్పీఎస్ఎస్, మస్కాపూర్ కేజీబీవీలలో బుధవారం గ్రేటర్ అట్లాంటా తెలంగాణ సొసైటీ చొరవతో పదో తరగతి విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. సొసైటీ తరఫున మండలానికి చెందిన ఎన్ఆర్ఐ వింజామర విజయ్‌కుమార్ రూ.15 వేల విలువైన పరీక్షప్యాడ్లులు, పెన్నులను అందజేశారు. వింజామర రాజు, సాయికృష్ణ ఉన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో నిర్వహించిన ఇంటర్ పరీక్షలు బుధవారం ముగిశాయి. 447మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 14 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్, డీవో సంపత్ తెలిపారు.

పోషణ్ పక్వాడ్‌పై అవగాహన

నర్సాపూర్(జి): చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజనీదేవి సూచించారు. మండల కేంద్రంలోని ఐకేపీ మహిళా సంఘ భవనంలో బుధవారం పోషణ్ పక్వాడలో భాగంగా గర్భిణులు, కిశోర బాలికలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఏపీఎం సులోచన, సీసీ ముత్యం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

నిర్మల్‌టౌన్: నిర్మల్ బస్టాండ్ ఆవరణలో సత్య సాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ప్రయాణికులకు పులిహోర పంపిణీ చేశారు. డిపో మేనేజర్ సాయన్న, ట్రస్ట్ సభ్యులు భీంసేన్, వెంకట్రావు, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని విఠ్ఠాపూర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం చలివేంద్రాన్ని సర్పంచ్ గల్లపురం లక్ష్మీరమేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి కవిత, వీడీసీ చైర్మన్ అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి

కుంటాల: రైతుల అభ్యున్నతికి తమ వంతు కృషి చేస్తామని సింగిల్‌విండో చైర్మన్ సట్ల గజ్జారాం అన్నారు. బుధవారం సొసైటీ స్థానిక కార్యాలయంలో నిర్వహించిన మహాజన సభలో మాట్లాడారు. 2022–23లో 1963 మంది రైతులకు రూ.9.66 కోట్ల స్వల్పకాలిక రుణాలు ఇచ్చామన్నారు. పంటల అధ్యయనం కోసం ఇజ్రాయిల్ వెళ్లి వచ్చిన డీసీసీబీ డైరెక్టర్ తూర్పాటి వెంకటేశ్‌ను పాలకవర్గ సభ్యులు సన్మానించారు. సీఈవో నాగభూషణం, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. కాల్వలను శుభ్రం చేయించండి



కుభీర్: మండల కేంద్రంలోని బట్టీగల్లీలో డ్రెయినేజీలు నిండిపోయి మురుగునీరు రోడ్డుపై పారుతోంది. దీంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. దోమల బెడద పెరుగుతుందని.. అధికారులు కాల్వలను శుభ్రం చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: విజయ్, ఈవో, కుభీర్, ఫోన్: 7396916252

నేడు కుస్తీ పోటీలు

లోకేశ్వరం: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని బిలోలి గ్రామంలో రామాలయ ఆవరణలో గురువారం మధ్యాహ్నం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు వీడీసీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు మల్లయోధులు సకాలంలో హాజరవాలని కోరారు.

ముగిసిన వారసంత వేలం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని పంచా యతీ కార్యాలయంలో బుధవారం 2023–24 సంవత్సరానికి వారసంత వేలంపాట నిర్వహించారు. నర్సాపూర్(జి)కే చెందిన బర్కుంట సాగర్ రూ.2,15,000కు దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాంరెడ్డి, ఎంపీటీసీ మల్లేశ్, కొండ్ర రమేశ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రేపు తైబజార్ వేలం

ఖానాపూర్: పట్టణంలోని మున్సిపాల్టీ పరిధిలో దిన, వార సంతలకు గానూ ఈనెల 31న శుక్రవారం తైబజార్ వేలం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు తెలిపారు. 2023–24 సంవత్సరానికి గాను వేలంలో పాల్గొనేవారు కమిషనర్ పురపాలక సంఘం ఖానాపూర్ పేరిట రూ.లక్ష డీడీ తీసి కార్యాలయంలో 30వ తేదీ వరకు అందజేయాలని సూచించారు.

దర్గాలో చాదర్‌కు నిప్పు

భైంసాటౌన్: పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టుకు వెళ్లే దారిలో కుభీర్ మలుపు సమీపంలోని దర్గాలో చాదర్‌కు స్వల్పంగా నిప్పంటుకుంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా, సీఐ ఎల్.శ్రీను వచ్చి పరిశీలించారు. దర్గాలో చాదర్ వద్ద అగరుబత్తులు వెలిగించడంతో చాదర్‌కు నిప్పంటుకుని ఉండవచ్చని భావిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	15
వంకాయ	50
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	70
క్యారెట్	100
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	120
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : దసరా
నారాయణ: బలగం

వైభవంగా చాలీసా పారాయణం



పారాయణంలో పాల్గొన్న మాజీ ఎంపీ రమేశ్

కడెం: మండల కేంద్రంలోని సీతారామచంద్ర ఆలయ ఆవరణలో మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే సుమన్ రాథోడ్ ఆధ్వర్యంలో బుధవారం హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హనుమాన్ దీక్ష ఉపసాకులు భోగ శ్రీనివాస్, వేద పండితుడు అనిశ్ దంపతులు హాజరయ్యారు. అనంతరం అన్నదానం చేశారు.

దస్తురాబాద్: మండలంలోని దేవునిగూడెం హనుమాన్ ఆలయంలో బుధవారం హనుమాన్ చాలీసా పారాయణం ఆలయ కమిటీ, గురుస్వామి అప్పల ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం స్వాములు, భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన

నిర్మల్‌టౌన్: వేధింపులకు గురి చేస్తే ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని షీటీం ఎస్సై సుమలత పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జుమరత్‌పేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీ టీ బృందం ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం సైబర్ నేరాలపై ఆన్‌లైన్‌లో శిక్షణ పొందిన విద్యార్థులను సైబర్ అంబాసిడర్‌గా నియమించారు. షీటీం పోలీసులు రమాదేవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

కుభీర్: మండలంలోని మాలేగాం ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఉపాధ్యాయులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గతంలో శిక్షణ పొందిన విద్యార్థులను సైబర్ నేరాలకు అంబాసిడర్‌గా ఎంపిక చేశారు. ప్రధానోపాధ్యాయులు పోశెట్టి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, జ్యోత్స్న, ప్రమీల, లక్ష్మీ, సాయినాథ్ తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద(సోన్): సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ మోసాలను గుర్తించే అంశంపై శిక్షణ తీసుకున్న విద్యార్థినులు శ్రీనిధి, అమూల్య, రితీష, సాత్విక, ఉపాధ్యాయురాలు రజిత సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ సరస్వతి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీవాణి, పోలీసులు తాహీర్, ప్రమోద్ పాల్గొన్నారు.

సోన్ ప్రెస్‌క్లబ్ కార్యవర్గం

లక్ష్మణచాంద(సోన్): సోన్ మండల ప్రెస్ క్లబ్ కార్యవర్గాన్ని సోన్‌లో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పోశెట్టి, మండల అధ్యక్షుడిగా రవీందర్, ఉపాధ్యక్షుడిగా రవి, ప్రధాన కార్యదర్శిగా స్వామి, సంయుక్త కార్యదర్శిగా రాకేశ్, కోశాధికారిగా జయరాజ్, సభ్యులుగా రమేశ్, రాజేందర్‌ను ఎన్నుకున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

లోకేశ్వరం: మండలంలోని పిప్రిలో రూ.10లక్షలు, గడ్‌చాందలో రూ.18లక్షలతో సీసీ రోడ్డు పనులు, రూ.10లక్షలతో డ్రెయినేజీ పనులను జెడ్పీ మాజీ చైర్మన్ శ్యాంసుందర్ ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, సర్పంచ్‌లు వెంకట్‌రావు, ముత్తవ్వ, నాయకులు ఉన్నారు.

కంటివెలుగు ప్రారంభం

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో బుధవారం కంటివెలుగు వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ రాజేశ్వర్, సర్పంచ్ రాజేందర్ ప్రారంభించారు. వైద్యురాలు శ్వేత, పలువురు సిబ్బంది శివ కృష్ణ పాల్గొన్నారు.